క్లుప్తంగా

పొగాకు ఆరోగ్యానికి హానికరం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: పొగాకు సేవించిన వారు క్యాన్సర్ బారిన పడుతున్నారని, పొగాకు ఆరోగ్యానికి హానికరమని పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. నేషనల్ టొబాకో ఫ్రీ యూత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పుత్లీబౌళిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు, గుట్కా, సిగరేట్, ఇతర మత్తు పదార్థాలతో ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. క్యాన్సర్, గుండెపోటు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వీటికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నివారణ సమన్వయకర్తలు వెంకటరమణ, శ్రీనివాస్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులకు మరమ్మతులు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బావోజీపేట్‌లో కల్వర్టు, సీసీరోడ్డు పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేయడంతో కల్వర్టులు కూలిపోయాయయని గ్రామస్తులు అన్నారు. శుక్రవారం మాజీ సర్పంచ్ టేకం లక్ష్మీదేవ్‌పురావులకు వినతి పత్రం అందచేశారు. గత ఏడాది మూడు కల్వర్టులు, సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ. 17 లక్షలు ఎంపీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కల్వర్టులకు మరమ్మతులు చేయాలని కోరారు.

సమావేశం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడలో ఈనెల 9న నిర్వహించే గోండ్వాన రాయి సెంటర్ పంచాయతీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు ఆత్రం మహేందర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మాట్లాడారు. కలెక్టర్ రాజార్షి షా, ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా హాజరు కానున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ఈవేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మెస్రం శంభు, మాడావి భీంరావు, మెస్రం జైవంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: అనాథ మృతదేహానికి బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. గత మూడు రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కేలో భిక్షాటన చేస్తూ అశోక్ సట్వాజి(30) మృతిచెందాడు. దీంతో పోలీసులు మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీలో భద్రపర్చారు. ఈ విషయాన్ని మహారాష్ట్రలోని జాగిర్ గ్రామంలో నివాసం ఉంటున్న మృతుడి మేనమామ జగన్నాథ్ సట్వాజికు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన శుక్రవారం ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు తన వద్ద డబ్బులు లేకపోవడంతో వెల్ఫేర్ సొసైటీ సభ్యులను ఆశ్రయించాడు. ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడ శ్మశానవాటికలో సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు అజీజ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రారంభం



ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్

సిరికొండ: మండలంలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ప్లాట్లను అధికారులు క్రమబద్ధీకరిస్తున్నారు. శుక్రవారం నుంచి ప్లాట్లను క్రమబద్ధీకరిస్తున్నారు. ఈకార్యక్రమాన్ని తహసీల్దార్ తుకారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తుదారులందరూ క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రతీ విషయం వివరించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విలాస్, పంచాయతీ కార్యదర్శులు అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎత్తుకెళ్తున్నారు..!



రైతు ఏర్పాటు చేసిన సోలార్ కంచె



బ్యాటరీని ఎత్తుకెళ్లిన దొంగలు

- పంటలు కాపాడుకునేందుకు సోలార్ కంచెలు ఏర్పాటు
- చోరీ చేస్తున్న దొంగలు
- ఆందోళనలో రైతులు

సిరికొండ: రైతుల కష్టాలు మరింత రెట్టింపు అవుతున్నాయి తప్పా తగ్గడం లేదు. పండించిన పంటలను అడవి జంతువుల బారీ నుంచి కాపాడుకోవడం కోసం అన్నదాతలు పంటచుట్టు సోలార్ కంచె ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే సోలార్ సామగ్రిని రాత్రి పూట దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు అష్టాకష్టాలు పడుతున్నారు.

రాత్రికి రాత్రే దొంగలపాలు..

తమ పంటలను అడవి జంతువులైన పందులు, కోతులు దాడి చేసి ధ్వంసం చేస్తుండడంతో రైతులు సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే సోలార్ కంచెలు, బ్యాటరీలను రాత్రికి రాత్రే ఎత్తుకెళ్తున్నారు. వేలు పెట్టి సోలార్ కంచె ఏర్పాటు చేసుకుంటే ఇలా దొంగలు ఎత్తుకెళ్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు మరింత అప్పుల ఊబీలో పడుతున్నారు. ఎలాగోల వాటి నుండి పంటలను కాపాడుకుంటున్నారు.కానీ రాత్రి సమయంలో పంటలకు రక్షణగా వేలకు వేలు పోసి పంట పోలం చుట్టు సోలార్ బ్యాటరీలను అమర్చుకుని పంటలను కాపాడుకుంటుంటే..ఈ కష్టాలు చాలవన్నట్టు పంటను కాపాడే సోలార్‌లనే దొంగలు ఎత్తుకెళ్లి మరింత కష్టాల్లో నెట్టుతున్నారు.సోలార్ దొంగతనంలో ఇటు ఆర్థికంగా నష్టపోతు..అటు పంటలను నష్టపోతున్నారు రైతన్నలు.

ఆందోళనలో రైతులు..

మండలంలోని రాంపూర్, రాంపూర్ గూడ గ్రామ శివారులోని పంట పోలాల్లో పంట రక్షణగా అమర్చుకున్న సోలార్ బ్యాటరీలను ఇటీవల దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం వచ్చి రైతు చూస్తే ఒక్క సామగ్రి కూడా కనిపించలేదు. దీంతో రైతు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పంటను కాపాడుకోవడం కోసం వేలు ఖర్చు చేసి సోలార్ బ్యాటరీలను అమర్చుకుంటే వాటిని సైతం ఎత్తుకెళ్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 15 వేలు ఖర్చు చేసి..



రాంపూర్ శివారులో పత్తి పంట వేశాను. ప్రస్తుతం పత్తి ఆశాజనకంగా ఉంది. అడవి జంతువుల నుంచి పంటను రక్షించుకునేందుకు రూ. 15 వేలతో పోలం చుట్టూ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నా. కానీ సోలార్ సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు.

– పవార్ రాము, రైతు, రాంపూర్‌గూడ

దొంగలను పట్టుకోవాలి



సోలార్ సామగ్రిని ఎత్తుకెళ్లిన దొంగలను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలి. అలా అయితే దొంగతనం జరగకుండా కాపాడుకోవచ్చు. పొలం చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ సామగ్రిని ఇటీవల దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– మోరె అంకేశ్వర్, రైతు, రాంపూర్

రాత్రి పూట పొలం వద్ద



అడవి జంతువుల నుంచి పంటను కాపాడుకోవడం కోసం సోలార్ కంచె ఏర్పాటు చేసుకున్నాం. దీంతో అడవి జంతువుల బెడద కొంత తగ్గింది. సోలార్ సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లడంతో రాత్రి కావలికి పోతున్నాం.

– నర్సింగ్, రైతు, రాంపూర్

గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్: ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్కాపూర్, చిన్నమల్కాపూర్, కొత్వాల్‌గూడలో పర్యటించారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానన్నారు. ఏ సమస్య వచ్చిన నేరుగా తనను సంప్రదించాలన్నారు. పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, ప్రీతంరెడ్డి, జ్ఞాను కేంద్రే, సంగ ఆశన్న యాదవ్, పవార్ రవీందర్, మాధవ్ కేంద్రే, సంతోష్ గౌడ్, భీంరావ్, రాందాస్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మికం

నేరడిగొండ: గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మికం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుంటాల గ్రామంలో శ్రీజగదాంబ దేవి, సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి రూ.43 లక్షలతో శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ బంజారా సంప్రదాయ పూజలు చేశారు. ప్రతిఒక్కరూ భక్తిభావనను అలవర్చుకోవాలని, దీంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. చిన్న బుగ్గారం గ్రామంలోని శ్రీజగదాంబ దేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద నూతన మండపం నిర్మాణానికి రూ.12 లక్షలతో భూమిపూజ చేశారు.

హమాలీ కార్మికుల సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న కార్మికులు

ఎదులాపురం: సివిల్ సప్లై హమాలీ కార్మికుల హమాలీ రేట్లను రాష్ట్ర ప్రభుత్వం పెంచనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో హమాలీ కార్మికులు సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ సివిల్ సప్లై అధికారులతో యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిర్వహించిన చర్చల్లో హమాలీల సమస్యల పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. హమాలీ రేట్లను సైతం పెంచనున్నట్లు వెల్లడించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి దేవేందర్, హమాలీలు పాల్గొన్నారు.

భూమిపూజ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రాథోడ్ బాబులాల్

ఎదులాపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనుక ప్రభుత్వం బంజారాలకు కేటాయించిన స్థలంలో ఆదివారం చేపడుతున్న బంజార భవన్ భూమిపూజను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకుడు రాథోడ్ బాబులాల్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ప్రభుత్వ నిధులు రూ.2 కోట్లతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు, ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అనిల్ జాదవ్, బొజ్జు పటేల్, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ హాజరు కానున్నట్లు తెలిపారు. బంజారాలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామారావ్, బలిరాం, వినాయక్, సతీశ్ నాయక్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి కార్యకర్తలు ఎంతో కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: బూత్‌స్థాయి కార్యకర్తలు ఎంతో కీలకమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, వార్ధా నియోజకవర్గ ఇన్‌చార్జి పాయల్ శంకర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయనను వార్ధా నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. అక్కడ నిర్వహించిన బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేసినప్పుడే విజయం సాధ్యమవుతుందన్నారు. కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: నీట్ పరీక్షలో ప్రతిభను కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించిన జిల్లా కేంద్రానికి చెందిన మెస్రం శ్రద్ధను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం సన్మానించారు. శ్రద్ధ నీట్ పరీక్షలో 464 మార్కులు సాధించి స్టేట్ ఎస్టీ కోటాలో మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిందని తండ్రి మెస్రం కృష్ణ తెలిపారు.

ధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: ఐటీడీఏ అధికారాలను కలెక్టర్‌కు అప్పగించాలనే తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీలకు సంబంధించిన ఏ సమస్య అయినా ఐటీడీఏ పరిధిలోనే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 7న ఐటీడీఏ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసమే ఐటీడీఏ ఏర్పాటు చేశారన్నారు. ఐటీడీఏ పరిధిలో ఐఏఎస్ అధికారి ద్వారానే ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఉమ్మడి జిల్లా ఆదివాసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, తొమ్మిది ఆదివాసీ తెగల సమన్వయ కమిటీ కార్యదర్శి కొట్నాక్ బారిక్‌రావ్, పుర్క చిత్రు, సోయం వినోద్, సోయం మురారీ, మెస్రం జైరాం పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

తానూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్వి గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంతనిఖీ చేసి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

తంతోలి గ్రామానికి చెందిన శంకర్‌కు 2వ ర్యాంకు



శంకర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన బొల్లి శంకర్ సోషల్ స్టడీ స్కూల్ అసిస్టెంట్‌లో జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. శంకర్ మండలంలోని వాన్‌వాట్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌గా విద్యార్థులకు బోధన చేస్తున్నాడు.

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవిలో కొనసాగుతున్న మంత్రి మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

తాంసి: రోజువారీ విధులకు హాజరయ్యే క్రమంలో సహకార ఉద్యోగి బైక్ అదుపు తప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన కర్నేవార్ గణేశ్..తాంసి సహకార సంఘంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులకు హాజరయ్యే క్రమంలో జిల్లా కేంద్రం నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. హస్నాపూర్, ఖోడదు గ్రామాల మధ్య అంతర్రాష్ట్ర రహదారిపై కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ఆయన తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి అతన్ని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపించారు.

మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కాత్లే భీంరావ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కారు డ్రైవర్ ఇమ్రాన్ భీంనగర్ గ్రామానికి చెందిన చాటే లక్ష్మి వద్ద నుంచి గత నాలుగేళ్ల క్రితం రూ.6 లక్షల అప్పు తీసుకున్నాడు. విడతలవారీగా చెల్లించాలని లక్ష్మి అడిగినా ఇవ్వడం లేదు. దీంతో రెండుసార్లు గ్రామపెద్దలు, కులపెద్దలతో పంచాయితీ పెట్టింది. పెద్దల సమక్షంలో ఇమ్రాన్ ఇస్తానని ఒప్పుకొని ఆరు నెలలైన ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వాలని అడితే చంపేస్తానని బెదిరించాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మి గొంతుపిసికి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

డబుల్ రోడ్డు పనులు ప్రారంభం



సావర్గాం సమీపంలో కొనసాగుతున్న పనులు

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) నుంచి జందాపూర్ వరకు ఉన్న అంతరాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కరంజి నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న రోడ్డుపై గుంతలు పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలోనే సింగిల్ రోడ్డు కోసం రూ.18 కోట్లు నిధులు సైతం మంజూరయ్యాయి. అంతరాష్ట్ర రోడ్డును డబుల్ రోడ్డుగా చేపట్టాలని మండలవాసులు ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత పది రోజుల క్రితం డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.18 కోట్ల నిధులతో 9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పిప్పల్ కోటి, సావర్గాం గ్రామాల మధ్య పనులు కొనసాగుతున్నాయి.

'పద్మశాలి' జిల్లా కమిటీని ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న మంచికట్ల ఆశమ్మ

ఎదులాపురం: జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం నాయకురాలు మంచికట్ల ఆశమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. జిల్లా సంక్షేమ సంఘం గడువు సెప్టెంబర్ 29 ముగిసిందని, ఈ క్రమంలో సంక్షేమ సంఘాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర సంఘాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, సంతోష్, నరేశ్, అడెల్లు, మోహన్, గణేశ్, వెంకన్న, హన్మండ్లు పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్ మేళా

ఆదిలాబాద్: ఇచ్చోడ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆర్టీసీ బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్ కాపీతో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోటో సైజ్ ఫొటోతో హాజరు కావాలని కోరారు. రుసుము రూ. 50 చెల్లిస్తే 50% రాయితీతో బస్‌పాస్ పొందవచ్చన్నారు.

కళాశాలలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

ఇంద్రవెల్లి: మండలంలోని లీమ్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ మారుతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాల ఆవరణలో ఆడిపాడారు. అనంతరం కళాశాలలో శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు ప్రమీళ, సరిత, వెంకటేశ్, శివ్‌రాజ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ

ఖానాపూర్: అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు సరిగా లేని 50 బైక్‌లు, రెండు త్రీవీలర్స్, రెండు ఫోర్ వీలర్స్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. మద్యం, గుట్కా, గంజాయి విక్రయం గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అనంతరం సీసీ కెమెరాలతో లాభాలు, సైబర్‌నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటర్



భీంపూర్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్

తాంసి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుకు ఆయా తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు టీచర్ ఉద్యోగస్తులు దరఖాస్తు చేసుకోవాలని తాంసి, భీంపూర్ తహసీల్దార్‌లు లక్ష్మి, నలంద ప్రియ కోరారు. కౌంటర్ కేంద్రాల్లో ఫారం నంబర్ 18, 19 సమర్పించి ఆధార్‌కార్డు, డిగ్రీ మెమోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.